క్లుప్తంగా

బీజేపీ నేతలను పరామర్శించిన త్రిపుర గవర్నర్



గుంటూరు మెడికల్: దివంగత బీజేపీ సీనియర్ నేత జూపూడి యజ్ఞనారాయణ సతీమణి హైమవతి, కుమారుడు రంగరాజును మంగళవారం గుంటూరులో త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనా రెడ్డి పరామర్శించారు. బీజేపీ సీనియర్ నేతగా పేరుపొందిన జూపూడి రంగరాజు తండ్రి దివంగత జూపూడి యజ్ఞనారాయణ విగ్రహానికి గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి, బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గవర్నర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ బీజేపీలో నాతో పాటు అనేక సంవత్సరాలుగా పనిచేసిన వారందరిని కలుసుకుంటున్నట్లు పేర్కొన్నారు. తెనాలిలో దివంగత టి.రామాచార్యులు కాంస్య విగ్రహాన్ని ప్రారంభించడానికి రావడం సంతోషంగా ఉందని తెలిపారు. కుటుంబ సభ్యులు జూపూడి పద్మావతి, జూపూడి యజ్ఞ దత్తు, నారపరాజు కృష్ణప్రియ, కాస్తల జగదీష్, కాస్తల రంగరాణి ఉన్నారు.

కొల్లిపర మార్కెట్ యార్డు నిర్మాణానికి మార్గం సుగమం

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి



గుంటూరు వెస్ట్: కొల్లిపరలో నిర్మించనున్న మార్కెట్ యార్డు నిర్మాణానికి మార్గం సుగమం అయిందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో రైతులతో సమావేశం మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది ఫిబ్రవరిలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, తెనాలి మార్కెట్ యార్డులో నిర్వహించిన వైఎస్సార్ రైతు భరోసా కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. ఆ సందర్భంలో కొల్లిపర రైతులు తమకు తమ ప్రాంతంలో ఒక మినీ మార్కెట్ యార్డు నిర్మించాలని ముఖ్యమంత్రిని కోరారన్నారు. అప్పుడు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ఆ ప్రాంతంలో భూమి ఉన్న రైతులతో మాట్లాడి 4.21 ఎకరాలకు అగ్రిమెంట్ అయిందన్నారు. త్వరలోనే దీనిని రిజిస్ట్రేషన్ చేయించి మార్కెట్ యార్డు నిర్మాణం ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో జేసీ రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, మార్కెటింగ్ ఏడీ రాజబాబు, కలెక్టరేట్ ఏఓ జానకి పాల్గొన్నారు.

దళిత, ప్రజాసంఘాల ర్యాలీ



నెహ్రూనగర్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని భారత కరెన్సీపై ముద్రించాలనే ప్రధాన డిమాండ్‌తో మంగళవారం దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగ ఫలాలు ప్రతి ఒక్కరికి చేరువ చేయాలని అప్పుడే అంబేడ్కర్‌కు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటులో అనవసర రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు. అంబేడ్కర్ ఆశయ సాధన సమితి జాతీయ అధ్యక్షులు కాల్వ రవి మాట్లాడుతూ ఈ డిమాండ్ సాధనకై గత 13 ఏళ్లుగా పోరాటం సాగిస్తున్నామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు అంబేడ్కర్ చిత్రపటాన్ని భారత కరెన్సీ ముద్రించాలని తమ మ్యానిఫెస్టోలో పొందుపరచాలని కోరారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు రంజిత్ ఓపేర్, దళిత సంఘాల నాయకులు అన్నవరపు కిషోర్, రాజేష్, నల్లపు నీలాంబరం పాల్గొన్నారు.

కెనడీ నెక్స్‌జెన్ కిడ్స్ స్కూల్లో జీ 20 ఫెస్ట్



గుంటూరు ఎడ్యుకేషన్: రాజేంద్రనగర్‌లోని కెనడీస్ నెక్స్‌జెన్ కిడ్స్ స్కూల్లో మంగళవారం జీ20 ఫెస్ట్ పేరుతో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గతేడాదిలో దేశానికి వన్నె తెచ్చిన జీ 20 సదస్సు, ఆస్కార్ అవార్డ్స్, ఏషియన్ గేమ్స్, చంద్రయాన్-3, ఆదిత్య ఎల్-1 తదితర విజయాలను ప్రస్తావిస్తూ నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. చంద్రయాన్-3 ప్రయోగాన్ని విద్యార్థులకు డిజిటల్ స్క్రీన్‌పై చూపించారు. అదే విధంగా ప్రస్తుత తరం విద్యార్థులకు దూరమవుతున్న హరికథ, బుర్రకథ, గొబ్బెమ్మలు, వర్లీ ఆర్ట్ తదితర సంబరాలను ప్రదర్శించారు. కాలుష్య నివారణ మార్గాలు, మానవ శరీరంలో అవయవ వ్యవస్థల పనితీరును చూపించారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్ కె.శ్రీకాంత్‌బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య, ప్రిన్సిపాల్ పీఎల్ హేమలత చిన్నారులను అభినందించారు.

వెల్‌డన్...

ఓ యజ్ఞం ముగిసింది. ఆశల శిఖరం అధిరోహించిన వేళ.. కలల స్వప్నం సాకారం అయిన ఘడియలు.. పుస్తకాలతో కుస్తీ పట్టి.. పరీక్ష కాలం నుంచి వైద్య వృత్తికి సిద్ధమైన రోజు.. తల్లిదండ్రులు కళ్లలో ఆనందం పంచుకున్న అరుదైన ఘట్టం గుంటూరు మెడికల్ కళాశాలతో మంగళవారం చోటుచేసుకుంది. ఎంబీ బీఎస్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టా ప్రదాన కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. – గుంటూరు మెడికల్







ఎంబీబీఎస్ డిగ్రీ పట్టాలు పొందిన విద్యార్థులతో అకడమిక్ డీఎంఈ డాక్టర్ రఘునందన్, డాక్టర్ పాదిల ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

అవకాశాలను సృష్టించుకుని ఎదగాలి

పొగాకు బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు అవకాశాలను సృష్టించుకుని ఎదగాలని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో మంగళవారం ఎంబీఏ- ఎంసీఏ విభాగ ఆధ్వర్యంలో ఏఎన్‌యూ అంతర్ కళాశాలల విద్యార్థులకు క్విజ్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ కాంటెస్ట్, షేర్ మార్కెట్ ట్రేడింగ్ గేమ్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీధర్‌బాబు మాట్లాడుతూ విద్యావంతులైన యువతరం ఎంచుకున్న రంగంలో అవకాశాలను అందిపుచ్చుకుని గమ్యాన్ని చేరుకునేందుకు కృషి చేయాలని సూచించారు. సాధారణ స్థితి నుంచి అసాధారణ స్థితికి చేర్చే ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటూ, అందరి ఆలోచనలకు భిన్నంగా ఎప్పుడైతే ఆలోచిస్తామో అప్పుడే మనం విజయానికి మార్గం వేసినట్లేనని చెప్పారు. ఎటువంటి వారికైనా సమయం ఒకటేనని ఆ సమయాన్ని ఎలా వినియోగించుకోవాలో తెలిస్తే, జీవితంలో గెలిచినట్లేనని అన్నారు. ముఖ్యంగా యువత ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల మాయలో పడి జీవితాలను విషపూరితం చేసుకోకుండా సాంకేతికతను మన అభివృద్ధికి ఉపయోగించుకుని జీవితాలను బంగారు మయం చేసుకోవాలని హితవు పలికారు. ఈసందర్భంగా కంప్యూటర్ ప్రోగ్రామింగ్ కాంటెస్ట్ పోటీల్లో హిందూ కళాశాల ప్రథమ స్థానంలో నిలువగా, తరువాతి రెండు స్థానాల్లో టీజేపీఎస్ కళాశాల నిలిచింది. బిజినెస్ క్విజ్‌లో టీజేపీఎస్ కళాశాల ప్రథమ స్థానం, హిందూ కళాశాల ద్వితీయ, తృతీయ స్థానాలు, షేర్ మార్కెట్ ట్రేడింగ్ గేమ్ పోటీల్లో ఆర్వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల, ప్రథమ స్థానం, హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఏబీపీ మనోహర్, డాక్టర్ ఎస్.అనితాదేవి, కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, కన్వీనర్ డాక్టర్ యు.రవి కుమార్, డాక్టర్ కేవీహెచ్ శాస్త్రి, చంద్రశేఖర్, నాగనిర్మల, డాక్టర్ జీవీ సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

మార్కెట్లు, మరుగుదొడ్ల నిర్వహణ హక్కుల వేలం



వేలం పాట నిర్వహిస్తున్న డెప్యూటీ కమిషనర్ వెంకటకృష్ణయ్య

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన మార్కెట్లు, మరుగుదొడ్లు, సైకిల్ స్టాండ్‌ల నిర్వహణకు సంబంధించి ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 31, 2025 వరకు హక్కుల కోసం ట్రావెలర్స్ బంగ్లాలో సీల్డ్ టెండర్, బహిరంగ వేలాన్ని నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన 19 ప్రాంతాల్లోని మరుగుదొడ్లు, సైకిల్ స్టాండ్‌లు, మార్కెట్లకు సీల్డ్ టెండర్, బహిరంగ వేలం నిర్వహించగా 13 ప్రాంతాల్లో టెండర్ దార్లు పాల్గొని టెండర్ దాఖలు చేశారని, మరో 6 ప్రాంతాల్లో టెండర్ దాఖలు చేయలేదన్నారు. టెండర్‌ల్లో ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న డాక్టర్ కొల్లి శారద మార్కెట్‌లో ఆశీలు రుసుం వసూలుకు అత్యధికంగా రూ.65,00,999, గాంధీపార్క్ మరుగుదొడ్ల వద్ద రుసుం వసూళ్లకు అత్యధికంగా రూ.32,85,000కు టెండర్ దార్లు బిడ్‌లు దాఖలు చేశారని తెలిపారు. తదుపరి కమిషనర్ అనుమతి, స్థాయి సంఘం ఆమోదం మేరకు తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు. కొల్లి శారద హోల్ సేల్ కూరగాయల మార్కెట్‌లో ఆశీలు, గాంధీ పార్క్ మరుగుదొడ్లకు, విజ్ఞాన మందిరం రోడ్డులోని మరుగుదొడ్లు, వెన్‌లాక్ మార్కెట్ సెల్లార్‌లోని సైకిల్ స్టాండ్, పాల ఆసుపత్రి వద్ద కూరగాయల మార్కెట్‌లో రుసుం వసూళ్లు, పచ్చగడ్డి మార్కెట్, అరండల్ పేట మెయిన్ రోడ్ తహసీల్దార్ కార్యాలయం వద్ద మరుగుదొడ్లు, నాజ్ సెంటర్ వద్ద మరుగుదొడ్లు, గాంధీ పార్క్‌లో క్యాంటీన్, బండ్ల బజార్ మరుగుదొడ్లు, కృష్ణా పిక్చర్ ప్యాలెస్ వద్ద మరుగుదొడ్లు, ఎన్టీఆర్ బస్టాండ్ వద్ద మరుగుదొడ్లు, డాక్టర్ కొల్లి శారద కూరగాయల మార్కెట్ మరుగుదొడ్ల నిర్వహణకు టెండర్ దార్లు పాల్గొన్నారని తెలిపారు. పాల ఆస్పత్రి దగ్గర మరుగుదొడ్లకు, నగరంలోని 6 ప్రాంతాల్లో ఉన్న నమ్మా టాయ్ లెట్స్, గాంధీ పార్క్ లోపల పార్కింగ్, సండ్రీస్ మార్కెట్, రంజాన్ పండుగ సమయంలో రెడ్ ట్యాంక్ స్థలం తాత్కాలిక ఆక్రమణ ఫీజు రెండు ప్రాంతాల్లో టెండర్‌లో ఎవ్వరూ పాల్గొనలేదని, కమిషనర్ ఉత్తర్వులు మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు సాంబశివరావు, బాలాజీబాష, రెహ్మాన్, రెవెన్యూ సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటరామయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు ఎంపికైన సబ్ జూనియర్ జిల్లా జట్టు



రాష్ట్ర పోటీలకు ఎంపికైన చిన్నారులు

గుంటూరు వెస్ట్(క్రీడలు): జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎస్వీఎన్ కాలనీలో సబ్ జూనియర్ బాల బాలికల జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొనసా వేణుగోపాల్ మాట్లాడుతూ వచ్చే నెల ఒకటి నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్న అంతర్ జిల్లాల సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొనే జట్టును ఎంపిక చేశామన్నారు. పోటీలను ఎస్వీఎన్ పార్క్ అధ్యక్షులు పార్థసారథి ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో వాకా పార్థసారథి, ముస్నంగి రాజేశ్వరరావు, పాటిబండ్ల సాంబశివరావు, కురందేశ్వరరావు, సరళ పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు ఎంపికైన బాలికలు: టి.హేమలక్ష్మి, ఆర్.కీర్తి, పి.మానస, కె.జీవిత, కె.లాస్య, ఎం.ఆకాష. బాలురు: జె.శశాంక్, ఐ.కార్తీక్, బంటు గావెల్.

ఇంధన పొదుపు తప్పనిసరి

నెహ్రూనగర్: మున్సిపాలిటీలలో ఇంధన పొదుపు అవసరం తప్పనిసరి అని నగరపాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) జె.శ్రీనివాస్ తెలిపారు. ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) ఆధ్వర్యంలో మంగళవారం అరండల్ పేటలోని ఓ హోటల్‌లో నగరపాలక సంస్థ ఇంజినీర్లకు, ఎమినిటి కార్యదర్శులకు ఇంధన పొదుపుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో విద్యుత్ బిల్లులను తగ్గించడానికి ఇంధన ఆదా, శక్తిని ఆదా చేయాల్సిన అవసరం ఉందన్నారు. వీధి దీపాలు, మున్సిపల్ భవనాలు, ఇతర పలు అంశాల్లో ఇంధన శక్తి పొదుపుకు అవకాశం ఉందన్నారు. ఏపీఎస్ఈసీఎం డీఈఈ జి.శ్రీనివాసులు మాట్లాడుతూ మునిసిపాలిటీల్లో డిమాండ్ సైడ్ మేనేజ్‌మెంట్ కింద లోడ్ తగ్గించేందుకు ఇంధన సామర్థ్య పెంపు అమలు చేసేందుకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఈఈలు కొండా రెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

గుంటూరు ఎడ్యుకేషన్: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్-2 ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ డి.ధాత్రికుమారి పేర్కొన్నారు. సాంబశివపేటలోని మహిళా కళాశాల ఆధ్వర్యంలో జోసఫ్‌నగర్, కృష్ణబాబు కాలనీలో చేపట్టిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా నాలుగోరోజైన మంగళవారం జోసెఫ్ నగర్ హైస్కూల్లో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నేతాజీనగనర్ జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం.దేవపాల్, కామర్స్ అధ్యాపకురాలు కె. సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు.

బీహెచ్ కళాశాల ఆధ్వర్యంలో..

బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ మహిళా డిగ్రీ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం -1 ఆధ్వర్యంలో దత్తత గ్రామం వెంగళాయపాలెంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా మంగళవారం కైలాసగిరిపై స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కార్యక్రమ నిర్వహణ అధికారి ఎం.గిరిజ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కౌసల్యాదేవి, లక్ష్మీదీప్తి, సంధ్య పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

గుంటూరు ఈస్ట్: ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న వ్యక్తిని పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. శ్యామలానగర్‌కు చెందిన వెంకటేష్ పాత నేరస్తుడు. గత కొద్దికాలంగా తిరిగి ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్నాడు. పలు కేసులో నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు వెంకటేష్‌ను మంగళవారం అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి పది ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నాడు. పోలీసులు వెంకటేష్‌ను అరెస్టు చేశారు. వెంకటేష్ చోరీ చేసిన ద్విచక్ర వాహనాలను ఓఎల్ఎక్స్‌లో పెట్టి తక్కువ రేటుకు విక్రయిస్తుంటాడు. తగిన రికార్డులు లేకుండా ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేయవద్దని పోలీసులు సూచించారు.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్ పాలన



రాజసుందరబాబును సన్మానిస్తున్న డొక్కా మాణిక్య వరప్రసాద్

నెహ్రూనగర్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆలోచన విధానాలకనుగుణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. మంగళవారం రెవెన్యూ కళ్యాణ మండపంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ నిర్మాణం చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందిస్తూ సామాజిక వేత్త డాక్టర్ గోళ్లమూడి రాజసుందర బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. అంబేడ్కర్ బాటలో డాక్టర్ రాజసుందర బాబు కూడా పయనిస్తూ ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు.

రష్యా- ఉక్రెయిన్ యుద్ధ పరిణామాలపై చర్చ

లక్ష్మీపురం: రష్యా- ఉక్రెయిన్ యుద్ధ పరిణామాలపై అవగాహన సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం చర్చ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యావేత్త ఇ.చంద్రయ్య మాట్లాడారు. సంస్థ సభ్యులు సీనియర్ సిటిజన్ నాయకులు కె.సాంబయ్య, కోటేశ్వరరావు, మురళీకృష్ణ పాల్గొన్నారు. తొలుత సీనియర్ రిటైర్డు ఐఏఎస్ అధికారి జన్నత్ హుస్సేన్ మృతికి నివాళులర్పించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

గుంటూరు ఈస్ట్: వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ఎస్వీఎన్‌కాలనీకి చెందిన 30 సంవత్సరాల తమ్మిశెట్టి శ్రీను ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం హైదరాబాద్ వెళుతున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్చి 3న మాలల సింహగర్జన

నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బాపట్ల క్రిస్టియన్ భవన్‌లో మార్చి 3న మాలల సింహ గర్జన నిర్వహించనున్నట్లు మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు మల్లెల వెంకటరావు తెలిపారు. గుంటూరు లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సభకు సంబంధించిన పోస్టర్‌ను దళిత నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలుపుతున్న రాజకీయ పార్టీలకు తగిన రీతిలో బుద్ధి చెప్పేందుకు ఐక్యంగా పనిచేయాలని కోరారు. రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణను అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలపటం స్వార్థ కోసమే అన్నారు. వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలల ఐక్యతను చాటి చెప్పే విధంగ ఎస్సీ వర్గీకరణను అడ్డుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల ఐక్య సేవా సమితి అధ్యక్షులు బండ్లమూడి స్టాలిన్ బాబు, చార్వాక యూత్ సొసైటీ అధ్యక్షుడు డేవిడ్ విలియమ్స్, మాల మహానాడు నాయకులు సుధాకర్, భాస్కర్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యకర జీవితం

గుంటూరు రూరల్: పచ్చదనం పరిశుభ్రతతో ఆరోగ్యకరమైన జీవితం ఏర్పడుతుందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. ఏఎన్‌యూ, కళాశాల సంయుక్తాధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పచ్చదనం పరిశుభ్రతపై జొన్నలగడ్డ గ్రామంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక అవసరాలైన గాలి, భూమి పరిశుభ్రంగా ఉంచినట్లయితే మంచి ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమవుతుందని తెలిపారు. గ్రామంలోని వీధుల్లో తిరిగి ప్రజలకు మొక్కలు పెంపకం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యుడు ఐదయ్య, జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జీవీ సుధీర్‌కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కేఎస్ రజనీకాంత్ పాల్గొన్నారు.

ఇక రోబోతో మోకీలు శస్త్ర చికిత్సలు

- గుంటూరులో ఆధునిక చికిత్స
- రోబో ఆపరేషన్‌తో నూరు శాతం సత్ఫలితాలు
- పెరుగుతున్న జాయింట్ పెయిన్స్ బాధితులు
- ముందస్తు జాగ్రత్తలతో నివారించవచ్చు



సర్జరీ చేస్తున్న రోబో చిత్రం

గుంటూరు మెడికల్: ఆధునిక సాంకేతిక రంగం పరుగులు పెడుతోంది. స్మార్ట్ ఫోన్ యుగంలో ప్రతి రంగంలో పోటీ పెరిగింది. ముఖ్యంగా వైద్య రంగంలో సాంకేతికత పరిజ్ఞానాన్ని ఉపయోగించి రోగులకు అత్యాధునిక వైద్య సేవలను చేరువ చేసేందుకు వైద్యులు పోటీ పడుతున్నారు. అందులో భాగంగా ల్యాప్రోస్కోపి ఆపరేషన్లు, కీహోల్ సర్జరీలు, లేజర్ సర్జరీలు, విరివిగా వినియోగంలో ఉన్నాయి. వీటికి మించి మరింత మెరుగైన వైద్య సేవలను రోగులకు అందించేందుకు రోబోటిక్ సర్జరీలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే మెడికల్ హబ్‌గా గుంటూరు గుర్తింపు తెచ్చుకుంది. మెట్రోపాలిటన్ లాంటి నగరాల్లో లభించే రోబోటిక్ సర్జరీలను ప్రస్తుతం ఇక్కడ అందుబాటులోకి వచ్చింది.

యుక్తవయస్సులోనే జాయింట్ పెయిన్స్

జీవితంలో ఎన్నో ఆటుపోట్లకు గురి అవుతూ వృద్ధాప్యంలోకి అడుగిడిన తరుణంలో మరింత ఆందోళనకు, బాధకు గురిచేసేవి కీళ్లనొప్పులే(జాయింట్ పెయిన్స్). కాని ఆధునిక జీవనశైలి వలన నేడు యుక్తవయస్సులోనే కీళ్ల అరుగుదల సమస్యతో పలువురు బాధితులు వైద్యులను ప్రతిరోజూ సంప్రదిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 200 మంది మిలియన్ల మంది కీళ్ల అరుగుదలతో బాధపడుతున్నట్లు అంచనా. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ 300 మంది వివిధ రకాల సమస్యలతో ఆర్థోపెడిక్ వైద్య విభాగానికి వస్తుండగా వీరిలో 30 శాతం మంది ఆర్థరైటిస్ సమస్య బాధితులే. గుంటూరు జిల్లాలో 140 ఆర్థోపెడిక్ క్లీనిక్‌లు ఉండగా వీటిలో ప్రతిరోజూ 30 మందికి పైగా ఆర్థరైటిస్ సమస్యతో వైద్యం కోసం వస్తున్నారు. కీళ్ల బాధితులకు వైద్యులు మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు చేసి నూతన జీవితాన్ని ప్రసాదిస్తున్నారు. వైద్యుల ఆపరేషన్‌లలో రెండు నుంచి మూడు శాతం మందికి ఏదైనా సైడ్ ఎఫెక్ట్ ఎదురవ్వచ్చు. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా నూటికి నూరు శాతం కచ్చితత్వంతో రోబోటిక్ ఆపరేషన్లు చేస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి...

చిన్న వయస్సులోనే కీళ్ళఅరుగుదలకు పొగ తాగడం, స్థూలకాయం ప్రధాన కారణాలు. అయితే 55 సంవత్సరాలు పైబడిన వారిలో, స్థూలకాయం ఉన్నవారిలో, గతంలో కీళ్లకు దగ్గరగా ఫ్రాక్చర్ అయిన వారిలో, కీళ్ళ వాతంతో బాధపడే వారిలో, మహిళల్లో ప్రత్యేకించి రుతు క్రమం ఆగిపోయినవారిలో కీళ్ల అరుగుదల సహజంగా ఉంటుంది. నివారణ కోసం క్రమబద్ధమైన వ్యాయామం, అధిక శాతం కూరగాయలు, పండ్లు, విటమిన్-డీ, కాల్షియం అధికంగా లభించే పాల ఉత్పత్తులు, చేపను ఆహారంగా తీసుకోవాలి.

రోబో సర్జరీలతో నూరు శాతం కచ్చితత్వం



మెట్రోపాలిటన్ నగరాల్లో లభించే ఆధునిక మోకీలు సర్జరీలు గుంటూరు ప్రజలకు చేరువ చేసేందుకు రోబోటిక్ సర్జరీలు అందుబాటులోకి తీసుకొచ్చాం. సాధారణంగా వైద్యులు చేసే ఆపరేషన్‌లలో రెండు నుంచి మూడు శాతం ఏమైనా ఇబ్బందికరమైన పరిస్థితి తలెత్తవచ్చు. అలాంటి సమస్యలు ఏమాత్రం లేకుండా నూటికి నూరు శాతం కచ్చితత్వంతో రోబోటిక్ సర్జరీలు చేస్తున్నాం. ఇన్‌ఫెక్షన్లు సోకవు. రక్తం పోవడం తక్కువ. నొప్పి ఉండదు. రోగి త్వరగా కోలుకుంటారు. జాయింట్లు కాలపరిమితి ఎక్కువ కాలం ఉంటుంది. ఇన్సూరెన్సు కార్డులు ఉన్నవారికి ఉచితంగా రోబోటిక్ సర్జరీలు చేస్తున్నాం.

– డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్.

ప్రతి ఒక్కరూ తమవంతు సాయం చేయాలి

గుంటూరు మెడికల్: పవన్ జోవిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్జీవో డే సందర్భంగా మంగళవారం స్థానిక జేకేసీ కాలేజీ రోడ్డులోని కేబీఆర్ ఆశ్రమంలో పిల్లలకు భోజనం పెట్టి స్వీట్లు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ తమవంతు సాయం చేసి మానవత్వాన్ని తట్టిలేపాలని పవన్ జోవిత ఫౌండేషన్ నిర్వాహకులు సిదా పవన్ తెలిపారు. కార్యక్రమంలో షేక్ మొయిన్, వంశీ, దిలీప్, తల్లం శివకుమార్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌తో సామాజిక సేవకు అవకాశం

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థులు సామాజిక సేవకు అవకాశం ఉంటుందని హిందూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. మల్లికార్జునప్రసాద్ పేర్కొన్నారు. హిందూ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో గుంటూరు రూరల్ లక్ష్మీనరసింహపురంలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరాన్ని మంగళవారం ప్రిన్సిపాల్ మల్లికార్జునప్రసాద్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ పి.వేణుగోపాల్ సందర్శించారు.